


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

శుక్రవారం । 24 । ఏప్రిల్ । 2026


- రూ.2.70 కోట్లతో డార్మిటరి ప్రారంభం.
- రూ.1 కోటి బీటీ రోడ్ పనులకు శంకుస్థాపన



## గిరిజన విద్యార్థినులకు ఆధునిక వసతి

**భద్రాద్రి కొత్తగూడెం/ అక్షిత బ్యూరో:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు మండలం లంకమల్లారంలో గిరిజన బాలికల విద్యాభివృద్ధికి మరింత బలాన్నిచ్చేలా కీలక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలో అప్గ్రేడ్ చేసిన ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (గర్ల్స్)లో రూ. 2.70 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన డార్మిటరి భవనాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల మిగతా 2లో..



# సర్కారు పంతం డ్రైవర్ ప్రాణం!

- నర్సంపేటలో నిప్పుల కుంపటైన ఆర్టీసీ
- మృత్యువుతో డ్రైవర్ శంకర్ గౌడ్ పోరాటం
- మొండితనం వీడి చర్చలకు రండి
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**నర్సంపేట, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రోడ్లపై రయ్ రయ్ మంటూ రథాన్ని నడిపిన చేతులు.. ఇవాళ నిప్పుల పాలయ్యాయి. తమ పొట్ట కొట్టొద్దని, న్యాయమైన డిమాండ్లు తీర్చాలని రోడ్డెక్కిన ఆర్టీసీ కార్మికుల మొరను పాలకులు వినకపోవడంతో నర్సంపేట డిపో సాక్షిగా పెను విషాదం చోటు చేసుకుంది. సర్కారు చూపిస్తున్న నిర్లక్ష్యానికి మనస్తాపం చెందిన డ్రైవర్ బోళా శంకర్ గౌడ్, సమ్మె శిబిరం సాక్షిగా తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. "మా కొలువులు మాగ్గావాలి.. ఆర్టీసీ బతకాలి" అంటూ ఆయన మంటల్లో విలవిల్లాడుతుంటే, కాపాడలేక తోటి కార్మికులు పెట్టిన కేకలు అటు అధికారుల గుండెల్ని, ఇటు పాలకుల చెవుల్ని తాకేలా ఉన్నాయి.

### అసలు ఈ మంట ఎందుకు రగులుతోంది?

ఆర్టీసీ కార్మికులు ఇవాళ విలాసం కోసం రోడ్డు మీదకు రాలేదని, మిగతా 2లో..





### పట్టుదలకు మారుపేరు

## భగీరథ మహర్షి

- జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం
- కలెక్టర్ చంద్ర శేఖర్

**నల్గొండ, అక్షిత ప్రతినిధి:** పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి అని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కఠోర దీక్ష, పట్టుదలతో గంగను దివి నుండి భువికి తీసుకువచ్చి ప్రపంచాన్ని సస్యశ్యామలం చేసిన మహనీయుడని అన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, మిగతా 2లో..

## అర్హులందరికి అక్రిడిటేషన్ కార్డులు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:** అర్హులైన జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులు వచ్చేలా చూడాల్సిన బాధ్యత జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీపై ఉందని, అర్హులైన జర్నలిస్టులు అందరికి అక్రిడిటేషన్ కార్డు త్వరలో అందజేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




అన్నారు. గురువారం తన చాంబర్‌లో జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే గురుతర బాధ్యత పత్రికలు, చానళ్లపై ఉందని, అలాంటి విధులు నిర్వహించే మిగతా 2లో..





### అలనాటి 'మట్టి' పరిమళం'

## నేటికీ అపురూపం..!

- ఆధునిక కాలంలోనూ మారని మట్టి పాత్రల విశిష్టత
- సాంకేతికత పోటీని తట్టుకుని నిలుస్తున్న కుమ్మరి చక్రం

**యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో:** మానవ నాగరికత మట్టితోనే మొదలైంది. పుట్టుక నుంచి చావు వరకు మనిషి జీవితం మట్టి పాత్రలతోనే ముడిపడి ఉంది. ఒకప్పుడు వంటింట్లో మహారాణిలా వెలిగిపోయిన మట్టి పాత్రలు, కాలక్రమేణా అల్యూమినియం, స్టీల్, ప్లాస్టిక్ వస్తువుల రాకతో కాస్త వెనకబడ్డాయి. అయితే, మారుతున్న కాలంతో పాటు ఆరోగ్యంపై అవగాహన పెరగడం, సాంప్రదాయాలను గౌరవించే వారి సంఖ్య తగ్గకపోవడంతో మట్టి పాత్రలు మళ్ళీ తన పూర్వవైభవాన్ని సంతరించుకుంటున్నాయి. మిగతా 2లో..

# భైంసాలో విషాదం... ప్రజల గుండెల్లో నిలిచిన డాక్టర్ సురేందర్‌కు కన్నీటి వీడ్కోలు

### సేవా తపనతో జీవించిన వైద్యుడికి వేలాది మంది ప్రజల నివాళులు...

### అంతిమయాత్రలో భావోద్వేగ వాతావరణం

**నిర్మల్, అక్షిత బ్యూరో:** భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సురేందర్ ఆకస్మిక మరణం పట్టణాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది.

బుధవారం గుండెపోటుతో కన్నుమూసిన ఆయనకు గురువారం నరసింహ నగర్‌లో జరిగిన అంతిమయాత్రలో ప్రజలు భారీగా తరలివచ్చి నివాళులు అర్పించారు.

జీవితాంతం సేవామార్గాన్నే ఎంచుకున్న డాక్టర్ సురేందర్, నర్సాపూర్ (జి) ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందించడంతో పాటు భైంసాలో స్వంత ఆసుపత్రి నిర్వహిస్తూ పేదలకు, అవసరమైన వారికి







అందుబాటులో ఉండేవారు. బుధవారం తన ఆసుపత్రిలో ఓ రోగికి శస్త్రచికిత్స నిర్వహిస్తున్న సమయంలోనే ఆయనకు గుండెపోటు రావడం విషాదకర పరిణామంగా మారింది. వెంటనే నిర్మల్‌కు తరలించినప్పటికీ వైద్యులు ఆయనను కాపాడలేకపోయారు.

గురువారం జరిగిన అంతిమయాత్రలో కుల, మత భేదాలు మరచి వందలాది మంది ప్రజలు, అభిమానులు, బంధువులు పాల్గొన్నారు. సామాజిక, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా హాజరై తమ నివాళులు అర్పించారు. అంతిమయాత్ర మొత్తం భావోద్వేగంతో నిండిపోయింది.

ప్రతి ఒక్కరి నోటి మాట ఒకటే– "పాపం... ఒక మంచి మనసున్న డాక్టర్ వెళ్లిపోయాడు... ప్రజల కోసం బతికిన మనిషి ఇక లేడు" అని. రోగుల బాధలను తన బాధగా భావించి చికిత్స అందించిన డాక్టర్ సురేందర్, కేవలం వైద్యుడే కాదు, ఒక మానవతా విలువల ప్రతిరూపంగా నిలిచారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రజలు కన్నీటి నివాళులు అర్పించారు.

"డాక్టర్ సురేందర్ లాంటి సేవా తపన గల వ్యక్తులు సమాజానికి అరుదు... ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోతాయి" అని పలువురు పేర్కొన్నారు.

## గిరిజన విద్యార్థినులకు ఆధునిక వసతి

(మొదటి పేజీ తరువాయి)

పరిసర ప్రాంతంలో రూ. 1 కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గిరిజన బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన వసతి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆధునిక సదుపాయాలతో కూడిన డార్మిటరీలు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, మెరుగైన ఫలితాలకు దోహదపడతాయని అన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మణుగూరు ప్రాంతంలో విద్యా రంగం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్యా అవకాశాలను విస్తరించేందుకు ఇలాంటి ప్రాజెక్టులు కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు, జిల్లా డీసీసీ అధ్యక్షులు తోట దేవి ప్రసన్న, సర్పంచ్ పూనెం రమేష్ , ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అర్హులందరికి అక్రిడిటేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)



జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డులు అర్హత ఉన్న వారికి అందాలని, ఆ విధంగా జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈనెల 24వ తేదీ శుక్రవారం సాయంత్రం లోగా దరఖాస్తు చేయని పాత్రికేయులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్ లో దరఖాస్తు చేయాలని కలెక్టర్ సూచించారు. నూతనంగా ఎంపికైన అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాస రావు, వజ్జే వీరయ్య, షేక్ సైదా, కోల నాగేశ్వరరావు, ఎండి. ఖలీల్ అహ్మద్, డాక్టర్ బంటు కృష్ణ, రెబ్బ విజయకుమార్, శంకరమంచి రవీందర్ శర్మ, బత్తుల మల్లికార్జున్, బుక్క ఉపేందర్ లకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువ సమర్పించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ దర్శనం మల్లేశం, జిల్లా పౌర సంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాస రావు ఉన్నారు.

## పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి

(మొదటి పేజీ తరువాయి)

భవితరాలకు ఆ స్ఫూర్తిని అందించాల్సిన అవసరం ఉందన్నారు. సబ్బండ వర్గాల ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు చేరవేయడం ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అన్నారు. పనిలో అవరోధాలు వచ్చినా వాటిని ధైర్యంగా ఎదుర్కొని కృషి చేస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని భగీరథ మహర్షిని ఉదాహరణగా చెబుతారని అన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో సగర సంఘశీ తరఫున పని కల్పిస్తామన్నారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, రేషన్ బియ్యం వంటి సంక్షేమ పథకాలు, సగరం సంగంలోఅర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూస్తామన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు సగర, బీసీ వెల్ఫేర్ అధికారి సంజీవయ్య, సగరం సంగం అధ్యక్షులు రవికుమార్ సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లెట్ల మారయ్య సగర, జిల్లా కార్యదర్శి కరుణాకర్ సగర, తదితరులు మాట్లాడారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా సాగర సంగం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా సగర సంగం ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

## అలనాటి 'మట్టి' పరిమళం' నేటికీ అపురూపం..!

(మొదటి పేజీ తరువాయి)

### కుమ్మరి చక్రం.. కుటుంబానికి ఆధారం

తరతరాలుగా ఒక సామాజిక వర్గానికి చెందిన శ్రామికులు మట్టిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. బురద మట్టిని తెచ్చి, దానిని వదును పెట్టి, చక్రంపై పెట్టి వారు చేసే మాయాజాలం సామాన్యమైనది కాదు. కుండలు, బాణాలు, మూకట్లు, కూజాలు.. ఇలా రకరకాల రూపాలను ప్రాణం పోస్తూ ఎన్నో కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి బతుకుతున్నాయి. శ్రమ ఎక్కువైనా, గిట్టుబాటు తక్కువైనా సరే, కులవృత్తిని వదలని వారి నిబద్ధత ప్రశంసనీయం.

### వేసవి వచ్చిందంటే.. 'మట్టి' ఫ్రిడ్జ్ లే దిక్కు

ఎన్ని ఎలక్ట్రానిక్ ఫ్రిడ్జు వచ్చినా, వేసవి తాపాన్ని తీర్చడంలో మట్టి కుండకు సాటి మరేదీ లేదు. చలివేంద్రాల వద్ద దర్శనమిచ్చే ఎర్రటి కుండలు దాహార్తిని తీర్చడమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. సహజ సిద్ధమైన చల్లదనాన్ని ఇచ్చే గుణం కేవలం మట్టి పాత్రలకే సొంతం.

### శుభం నుంచి అశుభం వరకు

మన సంస్కృతిలో మట్టి పాత్రలకు విడదీయలేని సంబంధం ఉంది. పండుగలు, పెళ్లిళ్లు వంటి శు భకార్యాల్లో 'ఐరేని' కుండల ప్రాముఖ్యత తెలిసిందే. అలాగే మనిషి అంతిమ యాత్రలోనూ మట్టి పాత్రే తోడుగా నిలుస్తుంది. ఇలా జీవిత ప్రయాణంలో ప్రతి అడుగులోనూ మట్టి పాత్రల అవసరం నేటికీ కొనసాగుతూనే ఉంది.



### పోటీని తట్టుకుంటూ.. కొత్త సొబగులు

సాంకేతికత పెరిగి మార్కెట్లోకి విభిన్న రకాల పాత్రలు వస్తున్నా, కుమ్మరి కార్మికులు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మట్టి వాటర్ బాటిల్స్, మట్టి బిర్యానీ కుండలు, టీ కప్పులు, అలంకరణ వస్తువులను తయారు చేస్తూ ఆధునిక మార్కెట్లో పోటీ పడుతు న్నారు. ఆరోగ్యాన్ని కోరుకునే వారు మళ్ళీ మట్టి పాత్రల వైపు మొగ్గు చూపుతుండటం గమనార్హం. మట్టి పాత్రల వినియోగం కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, అది మన మూలాలను గౌరవించడం. విషపూరితమైన కెమికల్ కోటింగ్ పాత్రల కంటే, ప్రకృతి ప్రసాదించిన మట్టి పాత్రలే మన ఆరోగ్యానికి రక్ష అని నిపుణులు కూడా నొక్కి చెబుతున్నారు.

## సర్కారు పంతం డ్రైవర్ ప్రాణం!

(మొదటి పేజీ తరువాయి)

అది వారి మనుగడ పోరాటమని డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ గుర్తుచేశారు. "సొంత రాష్ట్రంలో బతుకులు బాగుపడతాయనుకుంటే, ఉన్న ఉద్యోగాలు ఊడిపోయే స్థితికి వచ్చాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నది కార్మికుల ప్రధాన డిమాండ్. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం, కొత్త బస్సులను కొనుగోలు చేయకుండా ప్రైవేటు వ్యక్తులకు రూట్లను కట్టబెట్టే ప్రయత్నం చేయడం వంటి చర్యలు కార్మికులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టాయి. గాలిలో దీపంలా మారిన తమ భవిష్యత్తును కాపాడుకోవడానికే వాళ్లు ఈ సమ్మెకు దిగారు" అని ప్రజలకు వివరించారు.



### ప్రభుత్వానిదే బాధ్యత: డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

ఈ హృదయ విదారక ఘటనపై స్పందించిన శ్రీనివాస్ ముదిరాజ్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "ఎండనక, వాననక జనాన్ని గమ్యాలకు చేర్చే డ్రైవర్లకు ఇదా మీరు ఇచ్చే బహుమతి ప్రభుత్వం చర్చలకు పిలవకుండా, కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడం వల్లే ఇవాళ శంకర్ గౌడ్ ప్రాణం మీదికి తెచ్చుకున్నాడు. ఒక పేద కార్మికుడు నిప్పుకు ఆహుతి అవుతుంటే ఇంకా మీ పంతాలు, పట్టింపులు తగ్గవా?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కార్మికుల కన్నీరు ఊరికే పోదని, ఇప్పటికైనా సర్కారు తన మొండి వైఖరి వీడి తక్షణమే ఆర్టీసీ జేఏసీ నాయకులతో చర్చలు జరపాలని శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కన్నీటి పర్యంత మవుతూ తోటి కార్మికులకు ఒక విన్నపం చేశారు. "బిడ్డలారా.. ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడకండి. మీ ప్రాణాలు మీ కుటుంబాలకు అండ. పోరాడి మన హక్కులు సాధించు కుందాం.. కానీ ఇలా ప్రాణాలు తీసుకోవద్దు" అని చేతులు జోడించి వేడుకున్నారు. శంకర్ గౌడ్ పరిస్థితి విషమంగా ఉండటంతో నర్సంపేట పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అటు కార్మికుల నిరసనలతో, ఇటు పోలీసుల భారీ మోహరింపుతో నర్సంపేట ప్రాంతం యుద్ధ ప్రాతిపదికన రణక్షేత్రాన్ని తలపిస్తోంది.



## ఉపాధి హామీ పనులను ప్రజలు ఉపయోగించుకోవాలి

### ఉపాధి హామీ పనులను పరిశీలించిన గ్రామ సర్పంచ్ కేళావత్ చిట్టి శంకర్ నాయక్

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రబండ తండా గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ కేళావత్ చిట్టి శంకర్ నాయక్ ఉప సర్పంచ్ కేతావత్ శంకర్ నాయక్ గ్రామంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఈ ఉపాధి హామీ పనులను అధిక సంఖ్యలో పాల్గొన్నాలని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున దగు జాగ్రతలు తీసుకోవాలని వారు ఉపాధి కూలీలను సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కేతావత్ భాస్కర్ నాయక్ కేతావత్ ప్రసాద్ నాయక్ మూడావత్ లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

## సత్తుపల్లిలోఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు

### స్వయంగా పాల్గొని ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ మద్దతు తెలుపుతుందని బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నేత, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. సత్తుపల్లిలో ఆర్టీసీ డిపో గేటు వద్ద కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో భాగంగా ఇచ్చిన ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులు అవుతున్నప్పటికీ అటు సంస్థ గానీ ఇటు ప్రభుత్వానికి గానీ




చీమకుట్టినట్లు అయినా లేదని, కార్మికుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం వారి హక్కులను కాలరాసేలా ప్రవర్తించడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ లు చాంద్ పాషా, మల్లూరు అంకమరాజు,బిఆర్ ఎస్ పార్టీ నేతలు వల్లభనేని పవన్, నరుకుళ్ల శ్రీను, చంటి, పూజల రవి, వెంకటేశ్వరరావు, గాదె సురేష్ తదితరులు ఉన్నారు.

## జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ చేతన్ నితిన్

**జగిత్యాల, అక్షితబ్యూరో:** జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా చేతన్ నితిన్ ఐపీఎస్, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చేతన్ నితిన్ ఐపిఎస్, 2022 బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలో జనగామ ఏఎస్పిగా విధులు నిర్వర్తించారు.



# ఘనంగా మహర్షి భగీరథ జయంతి

**మహబూబ్‌నగర్, అక్షిత న్యూస్:**

మహర్షి భగీరథ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్షి భగీరథ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే





యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి గురువారం పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ వద్ద ఉన్న భగీరథ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భగీరథ మహర్షి ఒక గొప్ప తపస్వి అని అన్నారు. వారు చేసిన తపస్సును ప్రసన్నమై శివ పరమాత్ముడు గంగాదేవిని భూమికి పంపించాడనీ, అందుకే మనము గంగా నదిని భగీరథి అని కూడా పిలుస్తామని అన్నారు. భగీరథ మహర్షి గంగానదిని భూమికి తీసుకువచ్చి మానవాళి పాపాలను పోగొట్టేందుకు చేసిన కఠోర తపస్సు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉందని తెలిపారు. ఆయన చూపిన దీక్ష, సంకల్పం, నిస్వార్థ సేవా భావం నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను తొలగించేందుకు భగీరథ మహర్షి అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు.

ఆ మహాపురుషుని జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నందుకు ఎంతో సంతోషమని కలెక్టర్ అన్నారు. ప్రజలందరికీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమతా, జిల్లా బి. సి సంక్షేమ శాఖ అధికారి ఇందిరా, స్థానిక ప్రజాప్రతినిధులు, బి. సి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని డివిజన్లలో అభివృద్ధి

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** మహబూబ్ నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులను సమాంతరంగా, సమగ్రంగా కొనసాగిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నగర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం





చేశారు. ఈ నేపథ్యంలో, మహబూబ్ నగరంలోని 21వ డివిజన్‌లో జనరల్ ఫండ్స్ ద్వారా రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఓపెన్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ డ్రైనేజీ నిర్మాణం ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న కాలువ సమస్యలు, వర్షాకాలంలో ఏర్పడే నీటి నిల్వలు, ప్రజలు ఎదుర్కొంటున్న అసౌకర్యాలు తగ్గుముఖం పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన మహబూబ్ నగరాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడం తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యత ఇస్తూ, అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులను మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కార్పొరేటర్లు గుండా సంతోష్, రమేష్ రెడ్డి, తిరుమల వెంకటేష్,, పెద్దగొల్ల నర్సింహులు, రామస్వామి అలాగే నాయకులు మైత్రి యాదయ్య, గుండా మనోహర్, నిర్మల, శ్రీను, లక్ష్మణ్ మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి యువతకు స్ఫూర్తి

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** భగీరథ మహర్షి యువతకు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహర్షి భగీరథుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిమాలయాల నుండి గంగానదిని భూమికి తీసుకువచ్చి మానవాళి దాహాన్ని తీర్చిన మహానుభావుడు భగీరథుడని తెలిపారు.



ప్రజల సంక్షేమం కోసం చేసిన ఆయన కృషి భారత చరిత్రలో మహత్తర ఘట్టంగా నిలిచిందన్నారు. ఒక వ్యక్తిగా ఆయన చేసిన ప్రయత్నం లక్షల ఎకరాల భూమిని సస్యశ్యామలం చేసి, భారతదేశాన్ని అన్నపూర్ణగా నిలిపిందని ఆయన కొనియాడారు. భగీరథ మహర్షి త్యాగం, సంకల్పం, పట్టుదల ప్రతి యువకుడికి ఆదర్శమని, కష్టసాధ్యమైన పనులను సాధించడానికి ఆయన జీవితం మార్గదర్శకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజ సేవలో అంకితభావంతో ముందుకు సాగాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, నగర కార్పొరేటర్లు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
శుక్రవారం । 24 । ఏప్రిల్ । 2026

# వెట్టి చాకిరి విముక్తికి కలిసి పోరాడుదాం

## పారా లీగల్ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో రాథోడ్ రమేష్

**వరంగల్, అక్షిత బ్యూరో:** వెట్టి చాకిరి,మానవ అక్రమ రవాణా నిర్మూలనలో పారా లీగల్ కార్యకర్త పాత్ర ముఖ్యమని హనుమకొండ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్ అన్నారు.

గురువారం హనుమకొండ జిల్లా న్యాయ సేవాసాధికారత సంస్థ,ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సంయుక్తంగా సుబేదార్ లోని అసంత భవన్‌లో జిల్లా పారా లీగల్ కార్యకర్తలకు మానవ అక్రమ రవాణా వెట్టిచాకిరి నిర్మూలన అంశం పైన ఒకరోజు శిక్షణ






కార్యక్రమాన్ని సంస్థ కోఆర్డినేటర్ బత్తుల కరుణ అధ్యక్షతన నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్డిఓ రాథోడ్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం వెట్టిచాకిరి మానవ అక్రమ రవాణా అనేది అత్యధికంగా జరుగుతున్న నేరాలలో ముఖ్యమైన నేరాలని ఇంకా ఈ వెట్టిచాకిరిపైన అందరము కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా కూడా ఇంకా మనుషులను అమ్మడం కొనడం జరుగుతుందని తెలిపారు. దీనిని నిర్మూలించేందుకు పారా లీగల్ కార్యకర్తలు, రెవెన్యూ జిల్లా ప్రభుత్వ శాఖలు తులసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

కార్యక్రమంలో అంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ జె శ్యాంసుందర్ హాజరై మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక పోలీస్ యూనిట్ ప్రత్యేకంగా పనిచేస్తుందని మానవక్రమ రవాణా గురించి గానీ వెట్టిచాకిరి గురించిన సమాచారం గానీ మీరు నేరుగా మాకు అంద జేసినట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ట్రిబ్యునల్ మెంబర్ డాక్టర్ అనిత రెడ్డి, అడ్వకేట్ కవిత, ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు, ఎర్ర శ్రీకాంత్, ఇక్బాల్ పాషా, ఐ,జె,ఎం ప్రతినిధి కరుణాకర్, ఐజాక్,తదితరులకు తోపాటు పారా లీగల్ వాలంటీర్స్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కవ్వంపల్లి

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో ఐకేపీ, హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ప్రారంభించారు.అనంతరం డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాల విషయంలో రైతుల కష్టనష్టాలను తొలగించడమే కాకుండా వారికి మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ధాన్యం కొను గోలు కేంద్రాలను ప్రభుత్వం విరివిగా ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించాలని, దళారుల చేతిలో మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్ర, ఏపీవో శ్రీవాణి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీగిరి రంగారావు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎలుక రాజు, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, కంది అశోక్ రెడ్డి, గోగూరి నర్సింహారెడ్డి, మామిడి అనిల్, నోముల అనిల్, ఎండీ రజాక్, బొంగోని రాజుతోపాటు మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి కాలం మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

## మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్, అక్షిత బ్యూరో:**

నగర ప్రజలకు వేసవి కాలం రెండు నెలల పాటు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఆటంకాలు లేకుండా ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ మంచి నీటి సరఫరాలో భాగంగా గురువారం రోజు కోర్టు రిజర్వాయర్ లో హైలెవల్ నీటి సరఫరా డివిజన్ల కార్పొరేటర్లు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో మేయర్ కొలగాని శ్రీనివాస్, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం జరిగింది. హైలెవల్ నీటి సరఫరాలో తరుచుగా తలెత్తున్న త్రాగు నీటి సమస్యలు, ప్రజల ఇబ్బందులు, వాటి పరిష్కారం, నీటి సరఫరా సమయపాలన, లీకేజీల నివారణ, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

పలువురు కార్పొరేటర్లు నీటి సరఫరాలో ప్రజల ఇబ్బందులు, సమస్యలను మేయర్, కమీషనర్ దృష్టికి తెచ్చారు. నీటి సరఫరాను మెరుగు పరిచి భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై పలువురు కార్పొరేటర్లు సలహాలు చేశారు. కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలపై సానుకూలంగా మేయర్, కమీషనర్ స్పందించి వెంటనే వాటి పరిష్కార మార్గాలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తూ దిశానిర్దేశం చేశారు. నీటి సరఫరా సమస్యల పరిష్కారంపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ మంచి నీటి సరఫరాపై ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

త్రాగు నీటి సరఫరా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు నెలలు త్రాగునీటి సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. పాలకవర్గ సభ్యులు సమావేశంలో దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తూ ప్రజలకు జవాబు దారితనంతో పని చేయాలన్నారు. వర్షాలు పడే వరకు త్రాగు నీటిలో ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించి సప్లైలో అంతరాయం లేకుండ సమయం ప్రకారం నీటి సరఫరా చేయాలని సూచించారు.

నీటి సరఫరా సమయంలో ఈఈ, డీఈ, ఏఈ, లైన్ మెన్, ఫిట్టర్ అందరు ఫీల్డ్ లో ఉండి పర్యవేక్షించాలన్నారు. సరైన ప్రెషర్ తో నీరు సరఫరా అవుతుందా లేదా గమనించి సమస్య ఉంటే వెంటనే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదు వచ్చిన స్వయంగా పరిశీలించి దాన్ని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల



న్నారు. అదికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్లు, ప్రజలు అధికారులు, సిబ్బంది దృష్టికి తెచ్చిన సమస్యను నోట్ చేస్కొని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. లైన్ మెట్లు, ఫిట్టర్లు ముఖ్యంగా జవాబుదారీ తనంగా పని చేయాలన్నారు. ప్రజల పట్ల దురుసుగా మాట్లాడినట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.


డీఈలు, ఈఈలు, ఏఈలు, గ్రౌండ్ లెవల్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తినా ముందస్తు జాగ్రత్తతో పరిష్కరించేలా చూడాలన్నారు. మానేరు డ్యాంలో నీటి సామర్థ్యం పాటించాలని ఇరిగేషన్ అధికారులను లేక ద్వారా కోరడం జరిగిందని ప్రస్తుతం 7 టీఎంసీల నీటి సామర్థ్యం ఉందన్నారు. నగరపాలక సంస్థ పరిదిలో లోలెవల్ హైలెవల్ లో సరఫరాను సమయం ప్రకారం గంట వరకు సప్లై చేయాలన్నారు. కొత్తగా నీటి సరఫరా పైపులైన్ పనులకు ప్రపోజల్స్ ఉన్నా మా దృష్టికి తేవాలన్నారు.

కోర్టు నుండి సుభాష్ నగర్ వరకు నూతన పైపులైన్ పనులకు ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. నీటి సరఫరాలో 60 మంది ని కొత్తగా తాత్కాలిక లేబర్లను తీసుకోవడం జరిగిందన్నారు. వారితో నగర వ్యాప్తంగా ఎక్కడ లీకేజీలు ఉన్నా గుర్తించి వెంట వెంటనే అరికట్టాలని అన్నారు. వాల్వ్ రిపేర్లు ఉన్నా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో కార్పొరేటర్లు, ప్రవీణ్ రావు, అంజన్ కుమార్, గంట శ్రీనివాస్, బండ రమణారెడ్డి, ఓంటెల సత్యనారాయణ రెడ్డి, వరాల నర్సింగం, గుగ్గిళ్ల జయశ్రీ, రమన్ చాడగొండ కవిత బుచ్చిరెడ్డి, సరిల్ల రాజకుమారి ప్రసాద్, గాజరమ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, పెద్దపల్లి శ్రీలేక జితేందర్, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, డీఈలు, ఏఈలు, లైన్ మెన్ ఫిట్టర్లు పాల్గొన్నారు.

# మహిళలు స్వయంకృషితో ఎదగాలి

## మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** మహిళలు స్వయంకృషితో ఎదగాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి స్థానిక వార్డు కౌన్సిలర్ చలపాటి శివ అన్నారు గురువారం స్థానిక గోల్డ్ షాప్ బజార్లో విజయ గణపతి దేవాలయం సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతి ప్రొఫెషనల్ బ్యూటీ పార్లర్ ను ఆమె ప్రారంభించి మాట్లాడారు మహిళలు విద్యతోపాటు ఆర్థికంగా వ్యాపార రంగాలలో




అభివృద్ధి చెందాలని అన్నారు తక్కువ ధరలకు సేవలు అందించి మంచి పేరు సంపాదించుకోవాలి కోరారు అదేవిధంగా జ్యోతి ప్రొఫెషనల్ బ్యూటీ పార్లర్ నిర్వాహకులు మీసాల జ్యోతిని వారు అభినందించారు ఈ కార్యక్రమంలో కొక్కు లక్ష్మీనారాయణ నెమ్మాది దేవమని, చింత కెజ్జమ్మ, శాంతి వర్ధన్, జేమ్స్, ప్రజ్ఞ, ప్రమోద్ ,విశ్వ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు

# వట్టిపల్లి తండా గ్రామంలో పైప్‌లైన్ పనులు ప్రారంభం

## ప్రతి ఇంటికి త్రాగునీరు అందజేస్తాం : గ్రామ సర్పంచి మోతి రామ్

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** తెలకపల్లి మండల పరిధిలోని వట్టిపల్లి తండా గ్రామంలో గ్రామ సర్పంచ్ మోతి రామ్ ఆధ్వర్యంలో త్రాగునీరు సరఫరా కోసం పైప్ లైన్ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ప్రతి ఇంటికి తాగునీరు చేరాలని ఉద్దేశంతో పైప్ లైన్ ద్వారా ఇంటింటికి నల్ల సౌకర్యం కల్పించి త్రాగునీరు సౌకర్యం అందజేస్తామని వారు తెలిపారు. వేసవికాలం ప్రారంభం కావడంతో ప్రజలకు, మూగజీవులకు దాహం తీర్చేందుకు ఈ ప్రణాళిక ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



### భూ భారతి పెండింగ్ దరఖాస్తులను

# త్వరితగతిన పరిష్కరించాలి

**సాదాబైనామా పరిష్కారంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, అక్షిత బ్యూరో:** గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో భూ భారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్



దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా (Simple Sale Deeds) సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ సంబంధిత అధికారులకు కీలక సూచనలు జారీ చేశారు. సాదాబైనామా కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి, ప్రతి దరఖాస్తును సమగ్రంగా ధృవీకరించాలన్నారు. భూ సంబంధిత పత్రాలు, పాత రికార్డులు, ఆదాయ పత్రాలు, తదితర వివరాలను ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా సమాచారం అందించి, ఎటువంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ స్థాయిలో తహసీల్దార్లు స్వయంగా పర్యవేక్షణలు నిర్వహించి, నివేదికలు సమర్పించాలన్నారు.

రెవెన్యూ డివిజనల్ అధికారులు సమస్యాత్మక కేసులను జిల్లా స్థాయికి పంపించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.

సాదాబైనామా ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతులకు న్యాయం చేయడం, వారి హక్కులను రక్షించడం, భూ రికార్డులను సక్రమంగా నమోదు చేయడం ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

### నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం తెలిపిన

# న్యాయవాది మేకల వెంకటరావు

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల కోదాడ ప్రముఖ సీనియర్ న్యాయవాది మేకల వెంకట్రావు హైదరాబాద్ వారి నివాసంలో భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ చనిపోయారని వారితో మాకు ఎంతో సన్నిహితం ఉందని, నాదెండ్ల భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలని



ఆకాంక్షించారు.అదేవిధంగా వారి కుటుంబానికి భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు అన్నారు.

# యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు**

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రైతు బంధు సమితి నల్గొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:**



రేవంత్ సర్కార్ అమల్లోకి తెచ్చిన యూరియా యాప్ ను రైతు ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసినట్లు తెలిపారు. చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డితో పాటు మరో నలుగురు రైతులు దాఖలు చేసిన పిల్ పై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్ తో కూడిన ధర్మాసనం గురువారం విచారం చేపట్టింది. ఈ మేరకు 2 వారాల్లో సమగ్ర కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టులో పిటిషనర్స్ తరఫున పాశం రవీందర్ రెడ్డి వాదనలు వినిపించారు.

ఈ సందర్భంగా చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు యూరియా యాప్ ద్వారా రైతులు యూరియా సప్లయి చేయడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మంది రైతులు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు.రైతుల్లో అధిక శాతం మంది నిరక్షరాస్యులు. వీరిలో చాలా మంది దగ్గర స్మార్ట్ ఫోన్స్ లేవు. కొద్ది మంది వద్ద స్మార్ట్ ఫోన్ ఉన్నా యూరియా యాప్ డౌన్ లోడ్ చేసుకొని ఫోన్లో యాప్ ద్వారా బుక్ చేసుకొనే పరిజ్ఞానం లేదు. దీనివల్ల రైతులంతా వ్యవసాయ అధికారులపై, ప్రయివేట్ నెట్ సెంటర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఉన్నది.యూరియా యాప్ ద్వారా యూరియా బస్తాలు బుక్ చేయించుకోవాలంటే ఇతర సంస్థలపై రైతులు ఆధారపడి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. అంతేగాకుండా రైతులంతా వారి వ్యవసాయ పనులను వదిలిపెట్టి యూరియా బస్తాల కోసం క్యూ లైన్లలో నిలుచోవాల్సిన దుస్థితి నెలకొంది. యూరియా కోసం రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.ఎకరానికి కనీసం ఒక బస్తా ఒకేసారి వేయాల్సిన అవసరముంది. 10 ఎకరాలు ఉన్న రైతుకు యాప్ ద్వారా బుక్ అయినట్లయితే 7 బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దీనివల్ల మిగతా 3 ఎకరాలకు బస్తాలు దొరకడం లేదు.15 రోజుల తరువాత మిగతా బస్తాల కోసం యూరియా యాప్ ద్వారా బస్తాల కోసం బుక్ చేసుకున్నా ఒక బస్తా కూడా ఇవ్వడం లేదు. రెండో విడతగా కూడా యూరియా వేయాల్సిన అవసరం ఉన్నది. 15 రోజుల కాలవ్యవధి తర్వాత కూడా 5 -6 బస్తాలు కూడా దొరకని దుస్థితి ఉన్నది. ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడానికి కౌలు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెకన్లలో స్టాక్ మాయమవుతున్నది. అంతేగాకుండా కౌలు రైతులకు ఓటీపి చేప్పే లోపే స్టాక్ యమవుతున్నది. కౌలు రైతులు యూరియా బస్తాలు పొందాలంటే రైతుల పాసు పుస్తకాలు సమర్పించాల్సి ఉంటుంది. అసైన్ ల్యాండ్ ఉన్న రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులంతా యూరియా యాప్‌ను ఎత్తి వేయాల్సిందిగా ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ యాప్ ఇలాగే కొనసాగినట్టయితే రైతులు బ్లాక్ మార్కెట్స్ బాట పట్టాల్సిన రోజులు ఇలాగే కొనసాగుతాయి.రైతులు యూరియాను సక్రమంగా వేయకపోయినట్టయితే పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది.రైతులు తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందని చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంట అంగోతు హాతీరాం నాయక్, మట్టపల్లి సైదులు, వేణుగోపాల్ రావు, పులి జగదీష్, హమీద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర కీలకం..

**విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత ముఖ్యమో,**

**తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకం..**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల నిర్వహణలో సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లాలో సంక్షేమ వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలంలోని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్నికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాల అభివృద్ధి, తల్లిదండ్రుల బాధ్యతలపై కలెక్టర్ అవగాహన కల్పించారు.

జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ......, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత ముఖ్యమో, తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకమని, విద్యార్థులు పాఠశాలలో నేర్చుకునే విద్యతో పాటు ఇంటి వద్ద తల్లిదండ్రుల ప్రోత్సాహం, పర్యవేక్షణ ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే కుటుంబం మరియు పాఠశాల మధ్య సమన్వయం అవసరమని స్పష్టం చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక డిజిటల్ విద్యా వనరుల ఏర్పాటు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యా నాణ్యతను మెరుగుపరచడానికి కృషి జరుగుతోందని వివరించారు.

జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం పెంపు, మధ్యలో చదువు మానేసే వారి సంఖ్య తగ్గింపు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై మరింత శ్రద్ధ వహించాలని, వారిని క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, ఇంటి వద్ద చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా పిల్లల అభ్యాసంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను ఉపాధ్యాయులతో చర్చించి వెంటనే పరిష్కారం కనుగొనాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజన పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు పిలుపు నిచ్చారు. ఈ పథకాలు విద్యార్థుల చదువుకు ప్రోత్సాహకరంగా నిలుస్తున్నాయని తెలిపారు. పాఠశాలలో ఇటీవల గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన సూచనలు చేశారు.

సంక్షేమ వారోత్సవాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతూ, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తోందని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

**భగీరథ మహర్షి పట్టుదల సేవాభావం ప్రతి ఒక్కరికి ఆదర్శం,**

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,**

**ఎమ్మెల్సీ కూచ్చుకుళ్ళ దామోదర్ రెడ్డి**

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లో నాగర్ కర్నూల్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మహర్షి భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయుడిగా భగీరథుని చరిత్రలో నిలిచిపోయారని అందుకే గొప్ప ప్రయత్నాలను 'భగీరథ ప్రయత్నం'గా పిలుస్తారని కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు.

లక్ష్యం పట్ల అంకితభావం, పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని భగీరథుని జీవితం యువతకు గొప్ప సందేశమని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది భగీరథ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని, ఈ వేడుకల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని భగీరథుని ఆశయాలకు అనుగుణంగా సమాజంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ....., భగీరథుడు భూమిపైకి గంగను తెచ్చిన మహనీయుడని, వారి త్యాగనిరతి, పట్టుదల ఆదర్శనీయమని ఎమ్మెల్సీ కొనియాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, భగీరథుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సగర కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సగర కుల సంఘాల ప్రతిపాదనలను ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.నాగర్ కర్నూల్ పట్టణంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తామని హామీ ఇచ్చారు.

సగర కుల సంఘ నాయకులు వక్తలు మాట్లాడుతూ భగీరథుని స్మరిస్తూ, విగ్రహాన్ని సగరకుల భవనాన్ని ఏర్పాటుకు, కృషి చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు,

సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు సాగర్,18వ వార్డు కౌన్సిలర్ చంద్రకళ సాగర్ సాగర సంఘం నాయకులు అల్లం రాముడు ,సీనియర్ జర్నలిస్టు సాయిలు సాగర్, లక్ష్మణ్ సాగర్ ,టౌన్ అధ్యక్షులు బాలయ్య సాగర్ ,బంగారయ్య సాగర్ ,సూరంపల్లి సుధాకర్ సాగర సంఘం నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు -మన బడి- మన అందరి బాధ్యత

**మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల గట్రావుపల్లి**

**గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 8 మంది విద్యార్థులు.**

**ఒకటి నుండి 5వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం.**

**వచ్చే విద్యా సంవత్సరం నుండి పిల్లలందరికీ పాఠశాలలు చేర్పించండి**

**పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న**

**ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం ఏ మోతిరామ్**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ప్రియమైన తల్లిదండ్రులకు గ్రామ ప్రజలకు నూతన విద్యా సంవత్సరం శుభాకాంక్షల తో.... సవిష్టి కృషి సమాజ బాగా సౌమ్యపుతో పాఠశాలలో విద్యతోపాటు విద్యార్థి సమగ్ర అభివృద్ధికి పాటుపడుతున్న మన ఊరి ప్రాథమిక పాఠశాలలోనే మీ పిల్లలందరినీ చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తు తీర్చిదిద్దుటకు మాకు అవకాశం కల్పించగలరు .జూన్ 12వ తేదీ నుండి ప్రారంభమయ్యే విద్యార్థులకు పుస్తకాలు. నోట్ బుక్స్. ఉచిత బట్టలు. తదితర వాటికి అందజేస్తుంది . పాఠశాలను ప్రారంభమైన వెంటన మా ప్రాథమిక పాఠశాలలో చేర్పించండి అంటూ ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు కోరుతున్నారు. పాఠశాల ప్రత్యేకతలు

ఆధారిత పాఠశాల బోధన, కంప్యూటర్ ఆధారిత బోధన, నిరంతర సమగ్ర మూల్యాంకన. వేగా పీటీఎంలో నిర్వహణ తల్లేరులతో, నిత్యం అభివృద్ధి గురించి చర్చించడం. ఓం వర్క్ ప్రాజెక్టు వర్కులపై ప్రత్యేక శ్రద్ధ. శరీరక మానసికల్లాస విద్యా స్పోర్ట్స్ అండ్ గేమ్. ప్రతిరోజు గ్రంథాలయ నిర్వహణ. విద్యార్థుల ఉత్తత మరియు వ్యక్తిగత పర్యవేక్షణ. వ్యాసరచన క్విజ్ సంస్కృతిక కార్యక్రమాలు. ఉచిత రెండు జతల యూనిఫార్మ్స్. ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు వర్కు బుక్కులు. అందజేయడం జరుగుతుంది. రాబోవు విద్యాసంవత్సరం ప్రతిరోజు రాగి జావా పాలు గుడ్ బ్రేక్ ఫాస్ట్ మరియు నాణ్యం వైన మధ్యాహ్న







పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయ బృందం ఎంతో కృషి చేస్తుంది. పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని గట్రావుపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రధానపాధ్యాయులు హెచ్ ఎం మోతిరామ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వివిధ గురుకుల పాఠశాలలో 8 మంది విద్యార్థులు సెలెక్ట్ అయ్యారు. అట్టి విద్యార్థులు సెలెక్ట్ కావడానికి ఉపాధ్యాయ బృందం కృషి ఎంతో ఉన్నది . గ్రామంలో ఉన్న ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివించేందుకు తల్లిదండ్రులు విద్యార్థులకు పాఠశాలలు చేర్పించి విద్యలో రాణించేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు కూడా ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టింది. ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలో మెరుగుపడేందుకు ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేసి భోజనం. ప్రవేశ పరీక్షలలో ప్రత్యేక శిక్షణ( గురుకులం మొదలగునవి). మా పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం కలదు. ఏ మోతిరామ్ ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం. ఎంఏ తెలుగు హిస్టరీ, ఎంఈడి, నరసింహ గౌడు ఎస్ జి టి బీఎస్సీ బీఈడీ. శైలజ ఎస్ జి టి బి ఎస్ సి .డి ఈ డి. పవన్ కుమార్ ఎస్ జి టి ఎం ఎస్ సి మ్యాస్ .డి ఈ డి., సుజాత ఎస్ జి టి బి కం బిఈడి. ఉపాధ్యాయులు కలరు. కనుక ప్రతి విద్యార్థిని గట్రావు పల్లి ప్రాథమిక పాఠశాలలో చేర్పించగలరని తల్లిదండ్రులకు కోరుతున్నా ము. ఈ విద్యా సంవత్సరంలో గట్రావుపల్లి పాఠశాల నుండి వివిధ గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు, అక్షిత .మల్లేష్. చరణ్ కుమార్. హరీష్ .నవీన్. నాని చరణ్. భాను ప్రకాష్ ,మల్లికార్జున్. ఈ ఎనిమిది మంది విద్యార్థులు గురుకుల లో సెలెక్ట్ అయ్యారు. అట్టి విద్యార్థులు గురుకులకు సెలెక్ట్ కావడంతో ఉపాధ్యాయ బృందం కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



# బడిబాట ద్వారా చైతన్యం

**బడీ ఈడు పిల్లల్ని బడిలో చేర్పించడం,తల్లిదండ్రులకు,**

**పిల్లలకు అవగాహన కల్పించడమే లక్ష్యం**

**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉద్దేశించిన ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

ఇందులో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దేశాయిపేటలో భారీ ర్యాలీ నిర్వహించి,ఇంటింటికి ప్రచారం నిర్వహించి తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.అనంతరం తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్



కార్డులను పంపిణీ చేశారు. ఇటీవల పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు వీడ్కోలు పలికినట్లు తెలిపారు.

**రాష్ట్రంలో రెండవ ర్యాంకు సాధించిన ఈసంపెల్లి సిరి**

ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో (ఎంపీహెచ్‌డబ్ల్యు) గ్రూప్ లో రాష్ట్రంలో రెండవ ర్యాంక్ సాధించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని ఇసంపల్లి సిరికి ఘనంగా సన్మానం చేశారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థుల ఉన్నత విద్యలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూముల రాజేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మంటల్లో గాయపడిన కుటుంబానికి మాతృదేవోభవ సొసైటీ ఆర్థిక సహాయం

**20 వేల రూపాయల నగదు, వంట సామాగ్రి ,దుస్తులు పంపిణీ**

**పేద కుటుంబాలకు అండగా మాతృదేవోభవ సొసైటీ**

**సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పబ్బా గీతా దేవి ఓరుగంటి రమా**

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** మాతృదేవోభవ సొసైటీ ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటుందని సొసైటీ అధ్యక్షురాలు పబ్బ గీతాదేవి అన్నారు కోదాడ పరిధిలో గల సాలార్జంగ్ పేటలో ఇటీవల గ్యాస్ లీకేజీ కారణంగా మంటల్లో తీవ్రంగా గాయపడిన షేక్ నాగుల్‌ను సొసైటీ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి రూ. 20,000 ఆర్థిక సహాయం నగదు తో పాటు దుస్తులు వంట సామాగ్రి అందజేశారు ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి ఓరుగంటి రమాదేవి, కోశాధికారి ఇమ్మడి సతీష్ బాబు మాట్లాడుతూ ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేసి, బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్ర



మాన్ని సమన్వయం చేసిన తొడుపునూరి మంజుల మాట్లాడుతూ, బాధితుల పరిస్థితి తెలిసిన వెంటనే స్పందించి సహాయం చేయడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో మాతృదేవోభవ చారిటబుల్ సొసైటీ, కార్యదర్శి ఓరుగంటి రమాదేవి, కోశాధికారి ఇమ్మడి సతీష్ బాబు, డైరెక్టర్లు తొడుపునూరి మంజుల, కొండూరు మాధవి, వంకాయల స్వాతి, బందారు శ్రీనివాసరావు, వెంపటి ప్రసాద్, గరినే శ్రీనివాసరావు, జగని ప్రసాద్, ముక్కా సుశీల, వార్డు నాయకులు శోభన్, వార్డు ఇంచార్జి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY





# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు


**వనపర్తి అక్షిత ప్రతినిధి:** కొత్తకోట మున్సిపల్ కేంద్రంలో గురువారం శ్రీ శ్రీ శ్రీ భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని సగర యువజన సంఘం అధ్యక్షులు ఎస్పీ సురేష్ సాగర్ అద్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకోట భగీరథ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దివి నుండి భూమికి గంగానదిని తీసుకువచ్చిన మహనీయుడు భగీరథ మహర్షిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు భగీరథ మహర్షి సేవలను కొనియాడుతూ ఆయన ఆచరణీయ జీవితాన్ని యువత అనుసరించాలని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో నరేంద్ర సాగర్, కురుమూర్తి , వినోద్ సాగర్, సి. కురుమూర్తి , శ్రీను సాగర్, భాస్కర్ , అరుణ్ , సి. నాగన్న , వినోద్ కుమార్, రాజు, బుచ్చన్న , జనార్దన్ , పెద్ద వెంకటయ్య, రవి సాగర్, రాజా బాబు, కృష్ణ సాగర్, రాములు , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ సెల్లార్‌లో అనధికారికంగా వాహనాల పార్కింగ్

### తలెత్తనున్న భద్రతా పరమైన సమస్యలు...

**జనగాం, అక్షిత బ్యూరో:** జనగాం కలెక్టరేట్ కార్యాలయంలోని సెల్లార్‌లో అనధికారికంగా పార్క్ చేసిన వాహనాలపై అధికారులు దృష్టి సారించారు. భద్రతా మరియు నిర్వహణ పరమైన సమస్యలు
















తలెత్తుతున్న నేపథ్యంలో, అక్కడ నిలిపిన వాహనాలను వెంటనే తొలగించాలని సంబంధిత యజమాను లకు సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు మీడియా ద్వారా ప్రజలకు సమాచారం అందిం చాలని విజ్ఞప్తి చేశారు. అనుమతి లేకుండా పార్క్ చేసిన వాహనాల వల్ల కార్యాలయ పనితీరు మరియు అత్యవసర సేవలకు అంతరాయం కలుగుతోందని అధికారులు తెలిపారు. అందువల్ల, వాహన యజమానులు వెంటనే స్పందించి తమ వాహ నాలను తీసుకెళ్లాలని కోరుతున్నారు. లేకపోతే, అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

## కానయపల్లిలో ఘనంగా భగీరథ జయంతి

**వనపర్తి, అక్షిత ప్రతినిధి:** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భగీరత మహర్షి జన్మదిన వేడుకలు పి. శంకర్ జిల్లా కమిటీ లీగల్ అడ్వైజర్ ఆధ్వర్యశీలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ప్రతి ఏడాది భగీరథ మహర్షి జయంతి వేడుకలు మన గ్రామంలో జరుపుకోవాలని కోరారు. అనంతరం అయన సేవలను కొనియాడారు.



ఈ కార్యక్రమం లో గ్రామస్తులు సుర సాయిలు, సగర కృష్ణయ్య, సగర మన్నెం, సగర శ్రీనివాసులు, సగర వెంకటేష్, సగర కృష్ణ, సగర రఘు, సగర శశి, సగర వెంకటేష్, సగర శివ, సగర శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.







# రైతులకు లాభదాయక వ్యవసాయ అనుకూల వంగడాలను కనుగొనాలి

### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన మరియు విస్తరణ సలహా సంఘ సమావేశం పాలెంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణాధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ రైతుల సమస్యలకు సమయానుకూల పరిష్కారాలు కనుగొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో వ్యవసాయంలో మానవ శ్రమను తగ్గించుకోవడంతో పాటు, ఆరోగ్యానికి హాని కలిగించని పద్ధతులను అవలంబించాలని, పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన విధానాలను అనుసరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వాటిని తట్టుకునే పంటలు, సాంకేతికతలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయంలో రైతులకు లాభదాయక పంటల వైపుకు తరలించే విధంగా శాస్త్రవేత్తలు వ్యవసాయ వంగడాలను రూపొందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

రైతులు శాస్త్రవేత్తలు అందించే సలహాలు సూచనలను పాటిస్తూ తమ పంట పొలాల దిగుబడిని పెంచే విధంగా శాస్త్రీయ బద్దంగా పంటల సాగుకు అనువైన పరిస్థితులను కల్పించుకోవాలని కలెక్టరి సందర్భంగా కోరారు. కార్యక్రమ ప్రారంభోపన్యాసం చేసిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సంచాలకులు డా. ఎల్. కృష్ణ దక్షిణ తెలంగాణ ప్రాంతం వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపారు.

గత సంవత్సరంలో వరి, వేరుశనగ, సెనగ వంటి పంటల్లో సాధించిన పురోగతిని వివరించారు. ముఖ్యంగా వరి పంటలో అభివృద్ధి చేసిన RNR 25105, 31479 వంటి అధిక దిగుబడి, తక్కువ నూకశాతం కలిగిన వంగడాల గురించి వివరించారు. వేరుశనగలో నాణ్యమైన విత్తనాల ప్రాధాన్యతను కూడా వివరించారు.

విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డా.బలరాం మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వరి, అముదం పరిశోధన కేంద్రాలను అభినందించారు. చలి, ఎండలను తట్టుకునే పంట రకాల అభివృద్ధి, వరి ప్రత్యామ్నాయ పంటల విస్తరణ, వేరుశనగ మరియు ఇతర పంటల విస్తీర్ణాన్ని పెంచడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని వివరించారు. నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి మరియు పంపిణీలో విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని కూడా వివరించారు.

అలాగే యూరియా సమగ్ర వినియోగం, చిరుధాన్యాల ప్రోత్సాహం, అడవి పందులు, కోతుల వంటి జంతువుల వల్ల కలిగే నష్టాన్ని నియంత్రించడానికి తీసుకుంటున్న చర్యలను శాస్త్రవేత్తలు వివరించారు.

వ్యవసాయ విస్తరణ సంచాలకులు మాట్లాడుతూ...., డిజిటల్ వ్యవసాయం ప్రాధాన్యత పెరుగుతోందని, సామాజిక మాధ్యమాల ద్వారా రైతులకు సత్వర సమాచారం చేరవేయాలని సూచించారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన రైతు విజ్ఞాన కేంద్రాలు తెలంగాణ వ్యవసాయ రంగంలో కొత్త మార్పులకు దారితీస్తాయని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, రైతులు పాల్గొని భవిష్యత్ వ్యవసాయ ప్రణాళికలపై చర్చించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సమగ్ర వ్యవసాయం, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పద్ధతుల అమలు, వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను ప్రోత్సహించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. మెరుగైన వంగడాల అభివృద్ధి రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలకమని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో 200కి పైగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ సంచాలకులు, 12 జిల్లాల వ్యవసాయ అధికారులు, విస్తరణ శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు, చీూదీూ=ణ మరియు భారత వ్యవసాయ పరిశోధన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ ప్రణాళిక రూపకల్పనకు విలువైన సూచనలు, సలహాలు అందించారు.దఅంతేకాకుండా విశ్వవిద్యాలయ కార్యక్రమాలు రైతు స్థాయికి త్వరగా చేరేలా చర్యలు తీసుకోవాలని, కొత్తగా ఏర్పాటు చేసిన రైతు విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన అవసరం ఉందని వక్తలు సూచించారు. రైతుల శ్రేయస్సు కోసం చేపట్టిన కార్యక్రమాలు క్షేత్ర స్థాయికి వేగంగా చేరేలా సమన్వయం పెంచాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశం దక్షిణ తెలంగాణ వ్యవసాయ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచేలా పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు.

# రాంసాగర్ గ్రామంలో శ్రీ పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహణ

**కొమురవెల్లి, అక్షితన్యూస్:** కొమరవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలో శ్రీ పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఈ సందర్భంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవం వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఎంతో ఘనంగా సాగాయి. అనంతరం



భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి ప్రసాదం పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అక్కెనపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఐక్యత, సాంప్రదాయ విలువలు,భక్తి భావం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. గ్రామఅభివృద్ధి,ప్రజల సంక్షేమం కోసం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినగ్రామ ప్రజలందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లారెడ్డి,వార్డ్ మెంబర్లు,గ్రామపెద్దలు, యువకులు,గ్రామపంచాయతీ సిబ్బంది,ముదిరాజ్ బంధువులు మరియు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీలో స్కూల్ రెడీనెస్ పిల్లలకు సర్టిఫికెట్లు

**- సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:**
మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత ఆదేశాల మేరకు గురువారం బండ మీదగూడెం సెక్టార్ యాద్గారుపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యాచరణ ప్రణాళిక అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం ప్రీస్కూల్ సంసిద్ధత గ్రాడ్యుయేషన్ డే, స్కూల్ రెడీనెస్ ప్రదర్శన కార్యక్రమం నిర్వహిం చారు. సూపర్ వైజర్ హేమదేవి అంగన్వాడీ టీచర్లతో అంగన్‌వాడీలో పిల్లలు నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రుల ముందు ప్రదర్శించారు. తెలుగు, ఇంగ్లీష్ పదాల గుర్తింపు అంకెలు లెక్కింపు నైపుణ్యాలు రైమ్స్, పాటలు, కథలు పిల్లలతో చెప్పించారు.

ప్రాథమిక జీవన నైపుణ్యాలు పరిశుభ్రత అలవాట్ల ద్వారా పిల్లలు ప్రాథమిక పాఠశాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని చూపించారు. గ్రాడ్యుయేషన్ వేడుక పాఠశాలకు వెళ్లే పిల్లలకు సర్టిఫికెట్లు సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి అందించారు. ఎలక్ట్రానిక్ స్క్రీన్ లను అసలు ఉపయోగించని ఒక గంట సమయం కేటాయించాలని కంటి విశ్రాంతి కోసం, కుటుంబంతో సమయం గడపడానికి ఫ్యామిలీ ప్లే టైం కేటాయించాలన్నారు. 1000 రోజుల ప్రాముఖ్యతను గురించి వివరిస్తూ శిశువు మెదడును నిర్మించడానికి చాలా ముఖ్యమైనవి బిడ్డ చూసినా తాకిన రుచి చూడాలన్న వాసన చూడాలన్నా ప్రతిదీ మెదడుతో ఆలోచించడం అనుభూతి చెందడం, కదిలించడం, నేర్చుకోవడం కొరకు సహాయపడుతుంది. 90 శాతం బ్రెయిన్ డెవలప్మెంట్ యాక్టివిటీలతో కూడిన ప్రీస్కూల్ విద్య కేంద్రంగా అంగన్వాడి సెంటర్లలో ప్రీస్కూల్ విద్య బిడ్డ పెరుగుతున్న మెదడును ప్రభావితం చేస్తుందన్నారు. ఆడటానికి పాడటానికి కథలు అంగన్వాడి టీచర్లు అంగన్వాడిలో బోధించి ఆడించే బయటి ఆటలు ఇంటి వద్ద తల్లిదండ్రులు ఆడించాలి, పిల్లల తో సమయాన్ని





కేటాయించాలని పేరెంట్స్ కు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వి. హేమాదేవి, అంగన్వాడీ టీచర్స్ భాగ్య, సైదమ్మ, లక్ష్మి, సత్యలక్ష్మి, నాగమ్మ, ఉమా, అహ్మది, అబేధా, మాధవి, మెహరున్నిస, లింగమ్మ, నాగమ్మ, భారతి, నాగూర్ బి, లింగమ్మ హెల్పర్స్ నాగమ్మ, భద్రమ్మ, గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు, జడ్పీ హై స్కూల్ హెడ్మాస్టర్ బాలునాయక్, వార్డు మెంబర్లు జె.వెంకన్న. డి.రామకృష్ణ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి నివేదన
# 99 రోజుల కార్యాచరణలో విద్యార్థులతో కలిసి అల్పాహారం

32

**జగిత్యాల అక్షితబ్యూరో:** ప్రజాపాలన ప్రగతి నివేదన లో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో ఈ రోజు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్ అందరు



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.

విద్యార్థులతో మమేకమై వారి అభ్యాస పరిస్థితులు, వసతి సదుపాయాలు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. ప్రభుత్వం విద్యార్థుల



సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని, గురుకుల విద్యాసంస్థలను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు అందుతున్న సదుపాయాల పై తమ అభిప్రాయాలను వెల్లడించగా, అధికారులను త్వరితగతిన పరిష్కరించుటకు ఆదేశించారు

ఇట్టి కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సంగనబట్ల దినేష్,

జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్, బడుగు పద్మ రాజేందర్, బొల్లరపు స్వప్న గిరిధర్, ఖాజా కమలుద్దిన్, నాయకులు బండ శంకర్, దయాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట పోస్టర్‌ను ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ బుడిగే జహంగీర్ గౌడ్

**కొమురవెల్లి అక్షిత న్యూస్:** కొమురవెల్లి మండలంలో గల గురువన్నపేట గ్రామంలో బడిబాట కార్యక్రమం. సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ?నేడు మనం 'బడిబాట' కార్యక్రమం ద్వారా మన పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకుంటున్నాంఅని అన్నారు.విద్యే మన పిల్లలకు మనం ఇచ్చే అతి పెద్ద ఆస్తి. మన ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య,మంచి వసతులు అందుబాటులో ఉన్నాయి. నా మనవి ఏంటంటే బడి వయసున్న ప్రతి బిడ్డను పాఠశాలలోచేర్పించండి. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించండి.

మన గ్రామాన్ని 'వంద శాతం అక్షరాస్యత' గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ.అందరం కలిసి మన పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుదాం అని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్,గిరిబాబు,శ్రీకాంత్, అర్పిత ఏఎంసి




చైర్మన్,గ్రామ విద్యాశాఖ మంత్రి గణేష్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# అసాధ్యమైన పనిని సాధించడానికి నిదర్శనం "భగీరథుడు"

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, అక్షిత బ్యూరో:** నిరంతర ప్రయత్నం, అంకితభావం ఉంటే అసాధ్యమైన పనిని సాధించవచ్చు అని చూపిన మహనీయుడు భగీరధుడు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కష్టతరమైన పనిని సాధించడానికి భగీరథ మహర్షిని స్ఫూర్తిగా చూపిస్తామని, తరాలు మారిన భగీరధుడు సాధించిన విజయాన్ని స్మరిస్తూ ఉంటామని తెలిపారు. తలపెట్టిన పనిని పూర్తి చేసే వరకు ఎంత కాలమైనా అంకితభావంతో ప్రయత్నించాలని, భగీరధుడు ఆచరించి చూపారని తెలిపారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంలో భాగంగా ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** రేపటి హిందూ సమ్మేళన కార్యక్రమానికి రావలసిందిగా కోరుతు ఆసిఫాబాద్ పట్టణ వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది.



ఈ ర్యాలీలో హిందూ బంధువులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. రేపు సాయంత్రం జరిగే సమ్మేళనానికి గ్రామాల మరియు పట్టణం లోని హిందూ బంధువులందరు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని సభ్యులు కోరారు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఉబెద్ బిన్ యాహియా (తారీక్ )ర్యాలీ లో పాల్గొన్న వారికి చల్లని కూల్ డ్రింక్స్ మరియు మంచినీరు అందించారు.ఈ ర్యాలీలో లో అధ్యక్షుడు భోనగిరి సతీష్ బాబు,కాంద్రే విశాల్, వేణుగోపాల్, నాగుల శ్రీనివాస్, వారణాసి శ్రీనివాస్, సురేష్ చారి, సభ్యులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ కమిటీ తొలి సమావేశం...
# జర్నలిస్టుల సమస్యలపై చర్చ

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అక్రిడేషన్ కమిటీ తొలి సమావేశం నిర్వహించగా, జర్నలిస్టుల పలు అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కల్పించాలన్న విషయంపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిత సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. జర్నలిస్టుల అంశంపై స్పందించిన కలెక్టర్ హరిత, డిపిఆర్ఓ సంపత్ కుమార్‌లకు టి యు డబ్ల్యు (హెచ్) జిల్లా కన్వీనర్ రవి నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

